

# అంతర్వాహిని

గొల్లపూడి రాజ్యలక్ష్మి

"టింగ్.... టంగ్ టంగ్!"

ప్రక్కవాటాలోని గోడగడియారం పదకొండు గంటలు కొట్టింది. ఇంకా.. పదకొండేనా?

కాలం ఎంత నెమ్మదిగా.... నత్తలా ....నడుస్తోంది?

ఒక్కొక్క క్షణం- బద్ధకంగా నడవక తప్పదన్నంత సోమరితనంగా.... అబ్బబ్బ! ఎంత చమటపోస్తోంది! పైగా దోమలొకటి?

భగవంతుడా! ఇది ఎంత నరకం! అవును.... నరకమే!

మనిషి చచ్చిపోయాక నరకానికి పోతాడంటారు. నరకం ఇంతకంటే ఘోరంగా వుంటుందా?

వుండదుగాక వుండదు. దీనికంటె కొత్త ఆ నరకమే సుఖంగావుంటుందేమో కూడా!

ఇట్లా మంచంమీద పడివుండి- లేవలేక- కాళ్లూ చేతులూ సరిగ్గా స్వాధీనంలో లేక గడపటం ఎంత నరకమో తెలిస్తే నరకంలోని నరకానికి ఇంకేదైనా పేరు పెట్టి వుండేవారేమో!

అవునూ ...మొన్న వచ్చిన రామేశ్వరి ఏమంది?

"ఎంత నరకం అనుభవిస్తున్నావమ్మా!" అని కదూ.

దాని మనసుకు కూడా ఇది నరకంగా తోచింది కాబోలు!

కాని... కాని .. కోమలి దృష్టిలో తను రాజభోగాలు అనుభవిస్తోంది కదూ! ఇట్లాంటి అసహాయ పరిస్థితిలో పడి వుండటం రాజభోగమా! రాజులు అనుభవించే రాజభోగం ఇదా?

హు! నవ్వాలనిపిస్తోంది పగలంది! అవును .. ఏడవలేక నవ్వడమే. ఏం చేయగలదు తను? ఇప్పుడు ఆ రెండే తనకు చేతనయినవి. ఏడవడం-నవ్వడం.

ఈ రెండిట్లో ఎక్కువ భాగం ఏడుపులోనే గడిచిపోతోంది

అసలు.... ఆ మధ్య వచ్చిన వనజాక్షి తన పెద్దకోడలు... ఆమెను చూడగానే ఎందుకని తనకట్లా దుఃఖం ముంచుకొచ్చింది?

తనిట్లాంటి ఉతుకష్టంలో వున్నప్పుడు చూసిందన్న బాధవల్లనేనా? లేక "చూశావా? నువ్వెంత నరకం అనుభవిస్తున్నావో? ఒకప్పుడు నన్ను చూసి నీ లెక్కేమిటీ వాడు? అన్నట్లు ప్రవర్తించావు కదూ? మా బాగా అయింది! అనుభవించు!" అని లోలోన ఆమె సంతోషపడి వుంటుందనే భావనవల్లనా?

నిజంగా తను ఆ రోజుల్లో అట్లాగే అనుకుంది. పని అంటే తనకి ఎప్పుడూ భయంలేదు. ఎంత చాకిరి చేసేది? పనిమనిషి- చాకలి అంటూ వేరుగా తనెప్పుడూ మనుషుల్ని పెట్టుకోలేదు వనజాక్షి గానీ-కోమలి, జానకి, సుధలు గానీ, కోడళ్లుగా తనకు పనిలో సహాయం చేయటానికి ప్రయత్నిస్తే వేలు పెట్టనిచ్చేది కాదు. 'మీకెందుకమ్మా? పిల్లల పన్లు మీరు చూసుకోండి! మిగతా పన్లు నాకొదిలేయండి!' అనేది. నిజానికి వాళ్ళు ఆ పన్లు చేసే విధానం తనకు నచ్చేదికాదు. అన్నీ స్వయంగా తనచేతులతో చేస్తేనే తృప్తిగా వుండేది.

ఏమయిపోయిందా శక్తి?

నలుగురు మగపిల్లల్ని- ఇద్దరు ఆడపిల్లల్ని కన్నా- శరీరంలో దారుఢ్యం తగ్గలేదు. పిల్లలందర్నీ ఎంత గారాబంగా- పువ్వుల్లా చూసుకునేది! తన కడుపున రక్తం పంచుకుపుట్టి- ఈ రొమ్ముల్లో పాలు తాగిన ఈ పిల్లలు- ఈ రోజున ఈ శరీరాన్ని, దానికిపట్టిన రోగాన్ని అసహ్యించుకుంటూ- చీదరించుకుంటూ.... భగవంతుడా! నాకెందుకీ శిక్ష? నేనేం పాపం చేశానయ్యా? ఆక్రోశించింది మనసు.

కన్నీళ్లు కళ్ళ చివర్లనుంచి ప్రవాహాలవుతున్న కన్నీళ్లు ఇవేగా తనకు మిగిలింది. తనపై ఈ కన్నీళ్ళకెంత జాలి! పిలవకుండానే పలుకుతూ తన దయారసవృష్టిని కురిపిస్తాయి. ఈ ప్రపంచంలో తనకు కన్నీళ్లు తప్ప ఆప్తులు మరెవరూ లేరనిపిస్తోంది.

తుడుచుకోవాలి ... ఈ కుడిచేయి పైకి రావడానికి ఎంత మొరాయిస్తోంది. ఇప్పుడిట్లా పనికిమాలినదయిపోయిన ఈ చెయ్యి ఒకప్పుడు ఎంత కలిసొచ్చిన చెయ్యిగా పేరుతెచ్చుకొందో?....

పెద్దవాడికి కొడుకు పుట్టినప్పుడు- "నీచల్లనిచేత్తో దీవించమ్మా!" అన్నాడు.

"పిన్నిగారూ! మీ చేత్తో మా అమ్మాయికి నాలుగు అక్షింతలు వేసిపోండి" ఇరుగుపొరుగు ఇళ్లల్లో శుభకార్యాలు జరిగినప్పుడు.

"మీ చేత్తో ఏ మొక్క నాటినా- ఏ విత్తనం చల్లినా బాగా ఏపుగా పెరుగుతాయి. మీది చాలా మంచి చేయి!" దొడ్లో

పచ్చగా- ఏపుగా నవనవలాడుతున్న పొదుల్ని చూసినవాళ్లు అనేవాళ్లు.

"ఈ వంకాయలు తీసుకుని నీ చేత్తో కోసివెయ్యి తల్లీ! చల్లని తల్లివి ఈ తట్టంతా చిటికెలో ఖాళీ అయిపోద్ది! కూరలమ్ముకునే వాళ్లనే ప్రశంసలు.

ఏదీ ఆ అదృష్టహస్తం?... అదృష్టంతోపాటే అదీ చచ్చుబడిపోయింది, ఇప్పుడు తనొక శనిముండ... గుదిబండ!!

ఓహో నేస్తం? నువ్వాకన్నీళ్లా.... స్వాగతం!

అతి ప్రయత్నంమీద ఎడమ చేతిని పైకి లాక్కుని- కన్నీళ్లు తుడుచుకున్నాను.

దురద!

దోమలా? నల్లులా? పేలా? ఏమిటవి? వీసంతా కొరికేస్తున్నాయ్! ఎందుకింత దురద? గోక్కోవాలి గట్టిగా.... ఎట్లా?

ఈ దోమలకి కూడా తనపై ఎంత ప్రేమ! రాత్రి అవడం ఆలస్యం.... తన్ని చుట్టుముట్టి పీకి పెడతాయి.

ఈ చెమట- దోమలు... ఎవరైనా ఫ్యాన్ వేయరూ? వీటినుంచి నాకు విముక్తి నివ్వరూ?

ఎవరు? ఎవరేస్తారు! ఒరేయ్ బాబూ! ఒక్కసారి వచ్చిపోరా!

"అమ్మాయ్ కోమలీ! ఒకసారి రావూ?"

గాఢనిద్రలో వున్నవాళ్లకు- ఈ మునల్దాని యాతన ఎట్లా అర్థమౌతుంది?

తనే బాధ భరించలేని పరిస్థితి కొచ్చి పెద్దగా అరవాలి. అప్పటికిగాని వాళ్లకు విన్పించదు. అప్పుడొస్తారు విసుక్కుంటూ.

"ఏమిటే నీ గోల?" అంటాడు బాబు

తను గోలచేస్తోంది... విసిగిస్తోంది వాళ్లని.

ఈ మాటలు బాబు అంటున్నప్పుడు కోపానికి బదులు నవ్వు వస్తుంది. బాబు చిన్నప్పుడు ఎంత గోలచేసేవాడు! ఎంత విసిగించేవాడు!! ఎంత మొండివాడు ఇప్పుడు పెద్దవాడై- తనని గోలచెయ్యవద్దని.... నవ్వు రాదూ మరి?

ప్రక్కింటి గడియారం ఒకటి కొట్టింది.

ఇంకా ఒకటేనా? ఎప్పటికి తెల్లవారేను?

ఇట్లాంటి చీకటి రాత్రిళ్లు ఇంకా ఎన్ని గడపాలో? ఎప్పటికయినా తిరిగి వెలుగు కిరణాలు తన జీవితంలోకి తొంగి చూస్తాయా?

ఎప్పుడు? ఎన్ని యుగాలకి!

ఈ చీకటి రాత్రిళ్లు ఎప్పటికి తెల్లవారుతాయా అని తను చూస్తుంటే- "అప్పుడే తెల్లవారిందీ? అబ్బ! వెధవ చాకిరీ మొదలు" అంటూ కోమలి విసుక్కుంటూ లేస్తుంది.

వెధవ చాకిరీ! నిజమే... పట్నాలకిప్పుడు నిర్వచనంలేదు! గ్యాస్‌స్టౌలూ, మిక్సీలూ, కుక్కర్లూ, బాయిలర్లూ వచ్చినా మనిషికి సుఖం ఏదీ? గ్యాస్‌స్టౌ అంటించటం

ఓ కష్టం... కుక్కర్ స్టౌమీద పెట్టడమూ కష్టమేనాయె! ఇంత మనిషికి కష్టాల నుంచి విముక్తి లేదు....

తనకాలంలో... అవును ఓ తరం మారింది కదా! అది తన కాలమే! తెల్ల వారుజామున నాలుగ్గంటలకి లేవడంతో మొదలయేది పని! వాకిళ్లు వూడ్చుకోవడం, పిడకలతో పొయ్యి రాజేయడం, పాలు పితకడం, మజ్జిగచేయడం, గొడ్లసావిడి బాగుచేసుకొని- బావినీళ్లు చేదుకోవడం, పిల్లలు లేవగానే ఆ గదులు తుడిచి-వాళ్ల పనులు చూసుకోవటం, వాళ్లను స్కూళ్లకు పంపించి- వంటపని చేసుకోవటం .. ఇవన్నీ తనకు 'చాకిరీ'గా ఎప్పుడూ అన్పించేది కాదు. అంతేకాక ఇరుగు-పొరుగు ఇళ్లల్లో ఏదైనా పని అవసర పడినప్పుడు వెళ్లి సహాయపడేది. అలుపు-విసుగులనేవి తన నిఘంటువులో నే లేవు.

ఇప్పటి తరంవాళ్లకి ఏదీ ఆ ఓపిక, సహనాలు?

నాలుగు కుర్చీలు కూడా సరిగ్గా పట్టని ఈ చిన్న చిన్న గదులు ఊడ్వడానికి కూడా వుసురుమంటారు.

ఎందుకని? శారీరకమా.... మాన సికమా? ఎక్కడుంది లోపం?

అవును! మనస్సులోనే వుంది అంతా! ఈ పాడు మనసే అన్నిటికి మూలం!

తనకీ పాడు జబ్బు రాకుండా వుంటే... హుం! ఏదైనారాకుండా వుండాలేగానీ-వచ్చాక ఎన్ని అనుకుని ఏం ప్రయోజనం?

ఆ రోజున... సాయంత్రంగుళ్లోకెళ్దా మని-స్నానంచేసి పట్టుచీరె కట్టుకుని పూలకోసం- పన్నెజాజిపందిరి దగ్గరకు వెళ్లబోయింది! అంతే!

ప్రపంచమంతా గిర్రున తిరిగినట్ల యింది

కాళ్లు విస్తృత్తువగా మారడంతో దభాలున కూలిపోయింది. ఏం జరిగిందో చాలాసేపటిదాకా గ్రహించలేక పోయింది. లేవాలని ప్రయత్నించి విఫల మవటంతో-లోపలిగదిలో వున్న ఆయన్ని కేకేయాలని చూసింది. నోరు పెగలలేదు. తన అస్పష్టమైన కేకల్ని విని ప్రక్కింటి వాళ్లు వచ్చారు. ఆయనా వచ్చారు. హాస్పి టల్ కి తీసుకెళ్లారు. అంతా కలలాగా జరిగిపోయింది. తనకు పక్షవాతం వచ్చిందనీ, కాళ్లూ-చెయ్యీ చచ్చుపడినా యని డాక్టరు చెప్పకుండానే తెలిసి పోయింది. కొన్ని నిమిషాలలో తన జీవిత గమనమే మారిపోయింది. శిఖరంమీంచి ఒక్కసారిగా అగాధాల్లోకి త్రోసివేసింది విధి

ఆ తర్వాత... పిల్లలంతా వచ్చారు. కొంతసేపు సానుభూతి-కన్నీళ్లు-ఆవేదన ... ఆ తర్వాత? అప్పుడే మొదలైంది అసలైన ఘటం.

పిల్లలంతా పెద్దవాళ్లై ఎవరి సంసా రాలు వాళ్ళకి ఏర్పడివాక-ఆయనా-తనూ అంత ఇంట్లో నూ మిగిలిపోయారు. ఏదైనా పండుగ వచ్చినప్పుడు తామిద్దరూ

పిల్లలదగ్గర కెళ్ళటమో-వాళ్ళు రావడమో జరిగేది అప్పటికి ఇంకా తన వంట్లో శక్తి- ఆయనకు వ్యవసాయం పనులు వుండటం నుంచి- ఎవరిదగ్గరికీ వెళ్ళి వుండటం అన్న ప్రసక్తి కలుగలేదు. ఇక వెళ్ళక తప్పని పరిస్థితి!

పెద్దవాడు-రెండో వాడు మౌనం వహించారు. మూడో వాడు బాబూరావు మెల్లిగా విషయాన్ని కదిపాడు.

"అన్నయ్యా! అమ్మని నీతో తీసుకెళ్ళు. నాన్న నా దగ్గర వుంటాడు. పొలం కౌలు కిచ్చేసి- ఇల్లు అద్దెకు ఇద్దాము. వీటిపై వచ్చే ఆదాయాన్ని అమ్మ వైద్యంకోసం ఖర్చు చేద్దాం. ఏమంటావు?"

"వాళ్ళిద్దరి బాధ్యత మనిద్దరికేనా? మిగిలిన ఇద్దరికీ సంబంధం లేదా" అన్నాడు పెద్దవాడు.

"లేదని నేనెట్లా అనగలను? రెండో అన్నయ్య కలకత్తాలో వున్నాడు కదా! అంతదూరం వీళ్ళు ప్రయాణంచేసే స్థితిలో లేరు. ఇంక తమ్ముడి సంగతి నీకు తెలిసిందే! వాడి భార్య ఉద్యోగస్తురాలు కనుక అమ్మను కనిపెట్టుకుని వుండటం కుదరదు."

"ముందే నువ్వు ఒక నిర్ణయానికి వచ్చినప్పుడు - ఇంక నేను చెప్పేది ఏముంది!"

"అట్లాగనకు! పెద్దవాడివి. నీ అభిప్రాయ మేమిటో చెప్తే అట్లాగే చేద్దాం!"

"నీకు తెలియని విషయాలు ఏమున్నాయిరా? వదిన అనారోగ్యం తెలుసు కదా! అమ్మకు చేయలేదు. అందుకని నీ దగ్గరకే తీసుకెళ్ళు. నాన్న నా దగ్గర వుంటానంటే నాకేం అభ్యంతరం లేదు!"

తను మంచంమీద- ఆయన కాస్త దూరంలో కుర్చీలో- అన్ని మాటలు విన్నారు.

ఇట్లాంటి గడ్డుపరిస్థితి వస్తుందని- కలలో కూడా ఎప్పుడూ ఊహించలేదు.

బాబు దగ్గరికి తను వచ్చేశాక-ఆయన కూడా ఇక్కడే వుంటానని వచ్చేశారు. మా ఇద్దరివల్లా వీళ్ళు ఎన్నో బాధలు పడుతున్నారు కాబోలు!

నిజమే! ఒక రోగిష్టి మనిషికి సపర్యలు చేయటం- ఎంతో బాధాకరమే. అట్లా వాళ్ళచేత చేయించుకోవాల్సిన పరిస్థితి వచ్చినందుకు తనెంత బాధపడుతున్నదో- సిగ్గుపడుతున్నదో ఆ భగవంతునికే తెలుసు! ఈ పరిస్థితిలోంచి బయటపడటానికి ఒక్కటే మార్గం! మృత్యువు! అవును.... తను మృత్యువు దగ్గరికి వెళ్ళిపోతే. వాళ్ళకి- తనకు కూడా సుఖం!

మృత్యువును తల్చుకుంటే ఈ కన్నీళ్ళు ఎందుకో.... తన శరీరంలోని నీరంతా ఇట్లాగే ఖర్చయిపోతుందేమో. ఇట్లా ఏడ్చి.... ఏడ్చి.... సొమ్మసిల్లి.... ఎప్పుడో....ఎప్పుడోనా! ఎన్ని వేల యుగా

లకి! ప్రతి ఉదయం రాత్రికోసం, రాత్రిళ్లు ఉదయంకోసం తపిస్తూ...

అబ్బ!.... గొంతెండిపోయినట్టుగా వుంది. కాసిని నీళ్లు తాగాలి. దాహంగా వుంది ఎట్లా! వాడ్ని పిలవాలి! తప్పదు .... "ఒరేయ్ బాబూ! రారా!" పిలవడానికి ప్రయత్నించాను. అది 'బా....బా....బా....' అనే ధ్వనించింది. కాస్త పెద్దగానే పిలిచినట్లున్నాను. ప్రక్కగది తలుపు తీసుకొచ్చాడు బాబు. "ఊఁ.... ఏమిటి" అన్నాడు ఆవులిస్తూ. 'దాహం' అన్నట్లు చూశాను. గ్లాసుతో నీళ్లు తీసుకువచ్చి- నన్ను లేపి తాగించాడు. తిరిగి పడుకోబెట్టి-దుప్పటి కప్పి పోబోయాడు.

"ఫ్యాన్ పెట్టి పో...." అన్నాను.

"ఎంటమ్మా నీ గోల! ఇంకా ఏం కావాలి!" అన్నాడు విసుగ్గా- అర్థంకాక.

అయ్యో! వీడి కెట్లా చెప్పేది? "ఫ్యాన్‌రా.... చెమటరా!" దీనంగా చూశాను. అర్థమైనట్లుంది ఫ్యాన్ స్విచ్ వేసి వెళ్లిపోయాడు. మళ్లీ ఒంటరితనం .... పైన ఫ్యాన్ వేగంగా తిరుగుతోంది అమ్మయ్య.... ఇప్పుడు కాస్త సుఖంగా వుంది!

సుఖం!

అసలు సుఖమంటే ఏమిటి? అది ఆలోచిస్తే తమాషాగా వుంటుంది చెమటతో వుడికిపోయినప్పుడు చల్లని గాలి తెమ్మెర సుఖం! రెక్కలు ముక్కలయేలా కష్టపడినవాడికి - విశ్రాంతి ఎంత సుఖం!! కానీ ఈ సుఖాలు చెమటపోసినప్పుడు, కష్టం చేసినప్పుడు తెలుస్తాయి. ఈ రెండూ లేకపోతే ఈ సుఖం లేదు. ఎప్పుడూ మంచంమీద పడుకోవటం తనకేం సుఖాన్నిస్తోంది కనుక? ఇట్లా మంచంపై కొచ్చాక కంటి నిండా నిద్ర ఏది? ఎప్పుడూ ఏదో ఒక బాధ. శారీరకంగా.... మానసికంగా. వీటన్నిటి నుంచి దూరంగా ఏ లోకాలకో పోయినప్పుడు సుఖం, శాంతి కలుగుతాయేమో! స్వర్గలోక మనేది నిజంగా వుంటుందా? పురాణ గ్రంథాల్లో చెప్పినంత దివ్యంగానూ వుంటుందా? ఎవరు చూశారు కనుక? జీవుడు ఈ శరీరాన్ని వదిలాక ఎక్కడెక్కడో తిరుగుతాడంటారు. దానికి ఆకలి దప్పికలు, అనుభూతులు కూడా వుండవు కదా! ఇంక స్వర్గమేమిటి? నరకమేమిటి? ఏదైనా ఒకటే. కాని.... చివరి క్షణం దాకా ఈ బొందిని వదలనంటుందే మరి! ఇదే సుఖం.... ఇదే సత్యం.... ఈ దరి దాపు మనిషి జీవితమే కావాలని ఎందుకో ఆ పెనుగులాట? ఏమిటో భ్రమలు....!

రోజూ ఆయన భగవద్గీత శ్లోకాలు విప్పిస్తారు. కానీ అవన్నీ తనకు అర్థం కావు.

పదిరోజుల క్రిందట వచ్చిన నాలుగో వాడు సూర్యం. వాడి కేసెట్‌రికార్డర్‌లో ఘంటసాల భగవద్గీత పెట్టాడు. వినటా




వికి ఎంత హాయిగా వుంది! ఆ కాసేపూ అన్ని బాధలూ మరిచిపోయింది.

"అవి యిక్కడ వుంచి పోరా! అమ్మకు కాస్త కాలక్షేపంగా వుంటుంది!" అన్నాడు బాబు.

"అదెలా కుదురుతుంది? నీ పిల్లలనలే అసాధ్యులు. వీటి పాకాన పెట్టినా పెట్టగలరు!" అంటూ మెదలకుండా సూట్‌కేసులో సర్దుకున్నాడు.

తన మనసు చివుక్కుమంది!

నిజంగా వీళ్లెంత స్వార్థపరులు! వీళ్లకోసం తనెన్ని త్యాగాలు చేసింది!

సూర్యం ఎం.కామ్ చేస్తానన్నప్పుడు తన గాజుల జత ఇచ్చింది ఫీజుల కోసం. పెద్దవాడు ఇంటిస్థలం కొనుక్కోవటానికి నాలుగు వేలు తక్కువ అయినప్పుడు, రెండోవాడు పెద్ద ప్రయివేటు ఫర్మ్‌లో ఉద్యోగంకోసం అయిదు వేలు డిపాజిట్ కట్టాల్సి వచ్చినప్పుడు— తన నగలే అమ్మాల్సి వచ్చింది. పిల్లల అభివృద్ధికోసం కాకపోతే ఎందుకీ నగలు? ధరించిందేగాని— ఆ నగలే తన సర్వస్వమనుకోలేదు.

కానీ.... ఈ మంచానపడిన తల్లికోసం— కొంతకాలం వారి వస్తువును వుంచటానికి వారికి ఇష్టంలేదు.

రామేశ్వరి మొన్న వచ్చినప్పుడేమంది?

"వున్న నగలన్నీ నీ కొడుకుల కోసమే ఖర్చుచేశావు. అసలు తల్లి నగలు— ఆడపిల్లలకే దక్కాలి. మాకోసం ఏం మిగిల్చావు? తల్లికి ఆడపిల్లలపై ప్రేమ ఎక్కువ అంటారు గాని— నీకు మగపిల్లలపైనే ప్రేమ."

ఇట్లాంటి మాటలతో తనని ఎందుకు గాయపరుస్తారు వీళ్ళు? రామేశ్వరికి ఏం

లోటు చేశామూ? తను కోడలుకున్నంత వరకు చదువుకుంది. లక్షణమైన భర్త దొరికాడు. సుఖంగావుంది వాళ్ల కాపరం ఇంకా ఎందుకీ అసంతృప్తి? తనని చూసినప్పుడు దానికి వగలే గుర్తొస్తాయి కాబోలు!

ఆ కవి ఎవరో అన్నట్లు

'అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం'

'ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే నాటకం!'

టక్... టక్.... టక్....

గూర్ఖా కాబోలు... కర్రని నేలపై కొడుతూ పోతున్నాడు.

అంటే రెండుగంటలు దాటిందన్న మాట.

ఒకటికి పోవాల్సి వచ్చేట్టుంది. మళ్లీ బాబుని లేపాలా? పాపం వాడు ఎన్నిసార్లు లేస్తాడు. వరండాలోంచి ఆయన గురక వినిపిస్తోంది. ఎంత అదృష్ట వంతులు! హాయిగా నిద్రపోతున్నారు. తనకి ఒక రోగిష్టి భార్యవుందని-ఆమె కేదైనా అవసరమవుతుందని అనుకోరు. వేళకింత తినడం ఆ వేదాంతగ్రంథాలని ముందేసుకుని కూర్చోవటం-గుళ్ళూ-పురాణాలూ అంటూ కాలక్షేపంచేస్తూ చీకూ-చింతా లేకుండా వున్నారు. నిజంగా ఆయనకు చీకూ-చింతలు లేవా? పాపం ఆయనా మనస్సులో కృంగిపోతూనే వున్నారు. తన కిట్లాకావటం ఆయనకూ గొడ్డలిపెట్టే. వేళకి మందులు వేసుకో మనీ-దిగులుపడవద్దనీ ధైర్యంచెప్తూనే వుంటారు రెండ్రోజులకి ఒకసారి డాక్టరు గార్ని వచ్చి చూసిపొమ్మని ప్రతిమాలు తారు. ఆయన పిచ్చిగాని తనకిది తగ్గి-పూర్వంలా పనీ-పాటా చేసుకోగలదా? ఎన్ని మందులు! మింగి మింగి వెగటుతో చచ్చిపోతోంది. ఏం ప్రయోజనం? మాట రాలేదు... కాళ్లు చెయ్యా స్వాధీనంలోకి రాలేదు? తగ్గదు....తగ్గదు.... ఇంతే... ఇట్లా మంచంలో శవంలా....

హుంష్....త్వరగా ఒకటి కెళ్లాలి.... తప్పదు. పిలవాలి. ఏంఖర్మరా భగ వంతుడా?

ఎవరది? కోమలి కాబోలు బాతురూం కెళ్తోంది. కసీసం అట్లా లేచినప్పుడన్నా తన గదిలోకి తొంగిచూడదు కదా!

"అమ్మాయ్... బెడ్‌పాన్ పెట్టమ్మా!" కేకేశాను.

మళ్లీ తన గదిలోకి పోతోంది వినిపించుకోనట్లే.

"అమ్మాయ్!" గొంతు పెంచాను.

"అబ్బబ్బ....ఈ ముసల్ది రాక్షసిలా చంపేస్తోంది." అని విసుక్కుంటూ వచ్చింది.

"ఏంకావాలి? ఎందుకట్లా ప్రాణం పోయినట్లు అరుస్తారు? రాత్రిళ్లుకూడా నిద్రపోనివ్వరా?" కోపంగా ఇష్టమొచ్చి నట్లు మాట్లాడుతోంది!

"ఒకటికి వెళ్లాలి!" అన్నాను—

"ఏదో వ్వె ...వ్వె....వ్వె! అంటారు

నా కర్థమయిచావదు. మీ మాట పడి పోవటంకూడా నా ఖర్మ కొచ్చింది. ఎన్నాళ్ళిట్లా పీక్కుతింటారు మమ్మల్ని?" గొంతు పెంచింది. ఆయనకు నిద్రాభంగ మయినట్లుంది. "ఏమిటి కోమలమ్మా!" అన్నారు.

"అదిగో ఆయన లేచారుగా! ఆ బున్నే అడగండి!" విసురుగా తన గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

లోపలికి వచ్చారాయన. "ఏం? నిద్ర పట్టలా!" అన్నారు.

మళ్ళీ నా అవసరాన్ని చెప్పాను. అర్థం కాక నాలుగుసార్లు నన్ను వాగించి బెడ్ పాన్ పట్టారు.

తిరిగి పక్కకోబెట్టి-వరండాలోకి వెళ్ళి పడుకున్నారు.

ప్రతిరోజూ ఇది జరిగే కార్యక్రమమే అయినా ఎప్పటికప్పుడు ఇట్లా అందర్నీ విసిగిస్తున్నానే అన్న బాధతో సిగ్గు పడుతూనే వుంటాను. ఇంకా ఎంతకాలం. విసిగించి-విసిగించి- 'ఈ ముసల్ది ఎప్పుడు ఛస్తుందో కదా! అని ఎదురుచూసేలా గడపాలో... ఇప్పుడిట్లా మంచాన పడి పనికిరాకుండా పోయాను కానీ- ఈ జబ్బు రాకముందు 'అమ్మని పంపవలసినది.... ఇక్కడ మీ కోడలు పిల్లలతో చేసుకోలేకుండా వున్నది, అని ఉత్తరాలమీద ఉత్తరాలు రాసి పిలుపించుకునేవాళ్ళు కాదూ! ఎంత చాకిరీ చేసింది వీళ్ళకు! ఈ కోమలికి తల్లిలేకపోతే-తల్లిలా మాసుకుని మూడుపురుళ్ళూ తను కదూ పోసింది. ఆ రోజు ఏమంది? 'నాకు అమ్మ లేనేలేదు. అయినా మిమ్మల్ని చూసాక ఆ దిగులు మర్చిపోయాను అత్తయ్యా!' అదేనోటితో మొన్న పక్కింటావిడతో-

"ఈవిడ తిని తిరిగే రోజుల్లో ఎన్ని ఆరళ్లు పెట్టేదనీ! ఏ కోడలూ పడరాని కష్టాలు పడ్డాను. ఆ పాపం వూరికే పోదండి...." అన్నది. వీళ్ళంతా ఇట్లా ఎందుకు మారిపోయారు?

'ఈ ముసల్ది మంచాన పడింది. నోరు పడిపోయింది. ఇప్పుడు మనం ఎట్లా మాట్లాడినా ఏమిచేస్తుంది లే! నాలుగు రాళ్లు విసరడానికి ఇదే సమయం.' అనుకుంటున్నట్లున్నారు.

అన్ని శక్తులూ వుడిగిపోయి- దీనమైన స్థితిలో వున్న మనిషిని మాటలతో హింసించటాన్ని మానవత్వమంటారా? దానవత్వమా?.. అవును.... వీళ్ళంతా రాక్షసులు....రక్తం తాగే రాక్షసులు ... నా రక్తం పంచుకు పుట్టి నన్నే పీక్కుతింటున్నారు. ఇట్లా హింసించేకంటే ఇన్ని నిద్రమాత్రలు మింగించి చంపేయరాదూ ఒక్కసారిగా. అందరికీ పీడా వదులుతుంది! అవునూ.... చంపేయటమంటే గుర్తుకొచ్చింది....

నిన్న సాయంత్రం బాబు ఫ్రెండ్ ఆచారి వచ్చాడు. బాబు, కోమలి, ఆచారి వాకిట్లో కుర్చీల్లో కూర్చుని మాట్లాడుకున్న మాటలు- ప్రతి అక్షరమూ

గుర్తుంచి తనకు. ఆ సమయంలో ఈయన లేరు. గుళ్లో కెళ్లినట్లున్నారు.

ఆచారి "హలో కోమలిగారూ! నిన్న ఫంక్షన్‌కి మీరు రాలేదని మా ఆవిడ చాలాసార్లు అనుకుందండీ!" అన్నాడు.

"రావాలని ఎంతగానో అనిపించింది తెలుసుగా! ఆవిడ వున్నంతకాలం నాకీ చెర తప్పదు." అన్నది కోమలి విచారంగా

"ఎట్లా వున్నారామె?"

"మామూలే... ఎదుగూ లేదు- బొదుగూ లేదు. మా ప్రాణాల్ని తీసేసి కాని ఆమె దాటదు!" కోమలి కసి.

బాబు మౌనం,

"ఔను బాబూరావ్! ఈ మధ్య పత్రికల్లో చూశావటోయ్! 'మెర్సీ కిల్లింగ్' గురించి వాదోపవాదాలు జరుగుతున్నాయి. చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటున్నాయి!"

"మెర్సీ కిల్లింగా?" కోమలి.

"అవునండీ శరీరంలో అనేక రకాల బాధలు పట్టి పీడిస్తూ- వాటినుంచి విముక్తిలేని దశలో- ఆ పేషంట్‌ని ఆ బాధలనుంచి తప్పించడం.... అంటే.... అతని అనుమతితోనే డాక్టర్ అతని ప్రాణాల్ని హరించడం అన్నమాట!"

"అలాగా!.. మా అత్తగారిలాంటి వాళ్లకు ఇది వర్తించదేమో! ఆవిడ తను బాగానే వుంటోంది.. ఎదుటివాళ్లనే చంపుతోంది!"

"అట్లా అనకండి! ఆవిడకి బాధ లేదనుకోవటం తప్పు! పైకి చెప్పుకోవటానికి పాపం ఆమెకు మాటపోయింది కదా! శారీరకంగా కూడా ఆమెకు బాధలు వుండేవుంటాయి! నిజంగా ఆమె పరిస్థితి చాలా దయనీయం. ఆ విషయం వదిలేయండి 'మెర్సీకిల్లింగ్-' గురించి ఇంకా వివరాలు చెప్పండి!"

"చెప్తానుగా.... దీర్ఘరోగాలు వున్నవాళ్లు- చస్తూ వున్నవాళ్లని తినేస్తారు- వేధిస్తారు వాళ్లకు సుఖం వుండదు. ఎదుటివారికి వుండనీయరు ఎందుకండీ అట్లాంటి దరిద్రపు బతుకు? అందుకే పశ్చిమ దేశాలలో దీన్ని అమలుపరచాలని చూస్తున్నారు. అట్లాంటివాళ్లని మృత్యుదేవత ఒడిలోకి పంపి- బతికి నరకాన్ని అనుభవించేకంటే- చంపి సుఖపడేలా చేస్తారన్నమాట! మనం అనుకుంటాం చంపడం ఎంత ఘోరం, పాపం అని. కాని వాళ్లకు బాధలనుంచి విముక్తి కలిగించి- చాలా మేలుచేసినట్లు అవుతుందన్నమాట."

"నేనూ చూశాను. మన ఇండియాలో మాత్రం ఆ పద్ధతులు అమలు జరపటం కష్టం. కర్మసిద్ధాంతాన్ని వంటబట్టించుకున్న మనం- పాపభీతితో ముందు మనమే ఛస్తాం బాబు!"

"మీరు చెప్పిన విషయాలు బాగున్నాయి కానీ- చూస్తూ- చూస్తూ అట్లాంటి పనులు ఎట్లా చేయగలరండీ!-



ఎవరైనా? చంపటం అనేది అంత తేలికైన విషయమా?" అన్నది కోమలి.

ఆ మాటలన్నీ వింటున్నప్పుడు వళ్లంతా ముచ్చెమటలు పోసాయి. ఏదో భయంతో వణికిపోయింది. తన గొంతు పట్టుకుని ఎవరో నొక్కుతున్నట్లు గిలగిలలాడిపోయింది చాలా సేపటి తర్వాత –కాస్త తేరుకుంది.

'మాటలతో హింసించి– ఛీదరింపులతో బ్రతుకుపై ఆశను హత్యచేస్తూ కొంచెం కొంచెం నన్ను చంపటం అలవాటయిన వాళ్లకి– ఒక్కసారి 'చంపడ' మనేది ఎట్లా వచ్చుతుంది? నేను ఎట్లా చావాలన్నది– వీళ్లకు చర్చనీయాంశం అయిందా? వీళ్లంతా ముసలివాళ్లు కారా, ఏ జబ్బూ రానంతటి దృఢస్తులా? ఈ ప్రపంచంలో వీళ్లు శాశ్వతమైనట్లు.... నే నొక్కదాన్నే పనికి రానిదానినైనట్లు– భగవాన్! నాకు చెముడెందు కివ్వలేదు! ఈ మాటలు భరించలేను తండ్రీ! నాకు చావు నివ్వు తొందరగా.... ఇట్లా ఎవరికీ అక్కర్లేని బ్రతుకు ఎంతకాలం? సంతానవతి అయిన స్త్రీ ఎంతో సంపదవతి అంటారు. ఆ పిల్లలే ఆమెకు కొండంత రక్ష అంటారు. అది నా పట్ల హాస్యాస్పదం అయిపోయింది. ఈ సంతానంవల్లనే ఇన్ని మాటలు.... ఇంత హింస! మళ్లీ జన్మంటూ వుంటే నన్ను గొడ్రాలిగా పుట్టించు!!

నెలరోజుల క్రిందట– కలకత్తాలో వున్న– రెండోవాడు కాంతారావు వచ్చాడు.

వాడితో బాబు "అమ్మని నీతో తీసు

వెళ్లు! ఎన్నాళ్లని మేము భరించాలి! నా భార్యకి పిల్లలతో చేయటం యాతనగా వుంది! అమ్మపై నీకూ బాధ్యత వుంది." అన్నాడు నిష్కర్షగా.

అంతకు ముందు యిరవై రోజుల్నించి ఇంట్లో గొడవలుగా వున్నాయి. తనని హాస్పిటల్‌లో జాయిన్‌చేసి- అక్కడే వుంచమని కోమలి పోరు పెడ్తోంది ఇట్లా ఇంట్లో వుంటే బావని- ఈయన్ని- పిల్లల్ని చూస్తూ- వాళ్ల మాటల్ని వింటూ అప్పుడప్పుడూ కొస్త తనున్న పరిస్థితిని మర్చిపోగలుగుతోంది. ఆ హాస్పిటల్‌లో దిక్కులేనిదానిలా బెడ్‌మీద పడుంటే ... ఎవరూ పట్టించుకోక .... ఆ మందుల వాసన.... రకరకాల జబ్బుల మధ్య వున్న మతికూడా పోయి పిచ్చెక్కి తీస్తుంది అందుకే బాబు- ఆ విషయం తనతో అన్నప్పుడు వెళ్లనని మొండికేసింది. ఈయన కూడా- "అమ్మకి కాస్త మనశ్శాంతి కూడా లేకుండా చేస్తావా!" అని కాస్త బాధ పడ్డారు. అప్పటికి వూరుకున్నాడు .... ఇప్పుడిట్లా అన్నగార్ని చూడగానే తన మనసు బయటపెట్టాడన్నమాట!

కాని వీడికి అన్నయ్య అయినందుకు- ఇంకా రెండాకులు ఎక్కువే చదివాడని తెలియదు పాపం!

"నేను తీసుకెళ్తానని ఆశ పెట్టుకోకు! మా ఇంట్లో వుండటం కుదరదని నీకు తెలుసు. మీ వదిన తీసుకురావద్దని-తను చేయలేదని చెప్పేసింది. బాధ్యత అంటావా? నిజమే! డబ్బెంత కావాలో చెప్పు ... పంపిస్తాను!"

"అయితే నాకూ- నా భార్యకే పట్టిందా ఇదంతా!"

"అది నీ ఇష్టం .... నీకూ వీలు కుదరకపోతే ఎక్కడికైనా పంపెయ్!"

"ఎక్కడికి? అది కూడా నువ్వే చెప్పు!"

"ఒరేయ్ బాబూ... నన్ను ఒక్కసారే వల్లకాటికి పంపేయండిరా!" అని అరిచి తన తల మంచంకోడుకేసి కొట్టుకుంది.... ఏడుస్తూ.

నా మాట స్పష్టంగా లేకపోయినా- భావం వాళ్లకు తెలుసు.

తెలిసీ నావైపు నిర్లిప్తంగా చూస్తుండిపోయారు.

నా గుండె ఎందుకని పగిలిపోలేదు! తను మనిషి కాదు.... రాయి- అయివుండాలి. అవన్నీ విని ఇంకా- ఈ ప్రపంచాన్ని చూస్తున్నాను.... వింటున్నాను.

దయకూ- కరుణకూ మారుపేరుగా బ్రతికిన- తన కడుపున పుట్టి- వీళ్లింత కఠినులెట్లా అయారు? కన్నతల్లి అనయినా తలవని ఇంత స్వార్థపరత్వం ఎట్లా వచ్చింది? నా పెంపకంలోని లోపమా? నా స్వత్వంలోనే ఇంత విషముందా?

'నా భార్య చేయలేదు .... నా భార్య చేయలేదు!' ఎంత ప్రేమ.... జాలి ... కరుణ! వాటిలో వెయ్యోవంతు నాపై చూపరాదూ? అసలు వీళ్ల భార్యలు

ఎందుకు చేయాలి? నేను కన్నది వీళ్ళనా? వాళ్ళనా? కన్నతల్లిగా ఆ ఋణమేదో వీళ్ళు తీర్చుకోవచ్చుగా!

తల్లి అన్న అభిమానం వుండాల్సిన వాళ్ళకే లేకపోయాక- పరాయి అమ్మ తన్న బిడ్డలకి ఎక్కడి నుంచి వస్తుంది అభిమానం?

"కొక్కొరొకో .... కో ...."

కోడి కూసింది ఎక్కడో ...

అంటే నాలుగు గంటలన్నా అయి వుంటుంది. పక్కవాళ్ళింట్లోని గడియారం పలికినట్లు లేదే! దానికిచ్చిన 'కీ' జీవితం ముగిసిపోయింది కాబోలు.

అబ్బ! ఈ ఫ్యాన్ మరీ వేగంగా తిరుగుతోందేమిటి! చలి .... వణుకు పుడ్తోంది. ఎవరైనా ఆపితే బాగుండును. దుప్పటి ప్రక్కకి జారిపోయింది. కప్పు కుంటే బావుంటుంది. ఎట్లా? చేతికి పట్టు చిక్కడంలేదు .... అయ్యో! చలి పెరిగి పోతోంది! లోపల్నుంచి పుట్టుకొస్తోంది .... ఏం చేయాలి? మళ్ళీ వాళ్ళని లేపాలా? ఈసారి ఏమయినాసరే పిలవను. ఈ వణుకుతో- చలితో బిగుసుకుపోయినా సరే! అంతే!.... నాకి శాస్తి కావలసిందే! ఈ దరిద్రపు శరీరం తనని నమ్మించి ద్రోహం చేసింది ఎంతో ఆరోగ్యంగా వున్నట్టు నమ్మించి కూల దోసింది. దీని కి శిక్ష పడవలసిందే! అవనీ.... నా చేతులకే శక్తి వుంటే దీని పీక పిసికేద్దును. దీన్ని ఎంత హింసించినా తన కసి తీరదు.

చలి.... మరీ ఎక్కువై పోతోంది! లోన ఏదో మంట! చెవుల్లోంచి ఈ వెచ్చని ఆవిరి ఏమిటి? ఎందుకిట్లా అవు తోంది? ఎప్పుడూ ఇట్లా రాలేదే! నాకు ... నాకు చివరి క్షణాలు వచ్చేశాయా? అంత అదృష్టమా! ఏదీ? యముడు కన్పించడేం? తెల్లవారేలోగా నా బ్రతుకు అంతరించిపోతే ఎంత బావుంటుంది!

ఏమిటి... చెవులు దిబ్బళ్ళు వేసు కున్నట్లు మూసుకుపోతున్నాయి! కళ్ళ ముందు ఏవో.... చీకటి వలయాలు.... నాకేం జరుగుతోంది? నిజంగా.... నిజంగా నేను చచ్చిపోతున్నానా? నాకేం కన్పించటంలేదు.... నే నేమైపోతు న్నాను! ఏమిటో నాలోంచి విడిపోతున్న ట్టుంది. ఇదేనా? చావు యాతన అంటే? గుండెలమీద బరువు టన్నులకొద్దీ పెరుగుతోంది.... అవును! నేను చచ్చి పోతున్నాను.... అయ్యో! బాబుని-చిన్నదాన్ని- పెద్దవాడ్ని- ఆయన్ని- రామేశ్వరిని చూడలేనా ఇక? కాంతారావు - కమల దూరాన వున్నారు. కమలకు పుడుబోయే పసిబిడ్డడ్ని చూడాలనుకుంటిని కదూ. వీళ్ళకు దూరమైపోతున్నానా? కోమలి.... ఎళ్ళేదు, వీళ్ళేదు.... నేను చావను... చావను!!

ఒరేయ్ బాబూ! డాక్టర్ని పిలుచుకు రా! నాకు బ్రతకాలని వుంది. మీరు తిట్టినా సరే- కొట్టినా సరే.... బ్రతికే వుంటాను. మిన్నకుండా కళ్ళతో చూస్తూ .... మంచంలోనే వుం....టాను. నేను... బా....వ నా.... దా...."

పెద్దగా అరవాలని చేసిన ప్రయత్నం.... లోలోనే ఆగిపోయింది